సాక్షి
హనుమకొండ

గురువారం । 20 । జూలై । 2023



గోదావరికి పోటెత్తిన వరద

మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో గోదావరి పోటెత్తింది. దీంతో గోదావరికి 9.500 మీటర్ల ఎత్తులో నీటి మట్టం పెరిగింది. - 8లో▸



ఓపీఎస్ అమలు చేయాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం (ఓపీఎస్) అమలు చేయాలని ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూని యన్ నాయకులు డిమాండ్ చేశారు. - 10లో▸

గరిష్టం/కనిష్టం
29^0 /24^0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై జిల్లాలో రోజంతా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. ఈదురు గాలులు వీస్తాయి. సాయంత్రం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: వరంగల్ అర్బన్ జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 20న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ వెంకటేశ్వర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు హనుమకొండలోని జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నామినేటెడ్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

నేటినుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ




ఎంజీఎం: జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గురువారం నుంచి 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు (ఆల్బెండజోల్) పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. జిల్లాలో సుమారు 2,33,201 మంది పిల్లలకు ఈ మాత్రలు ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈమేరకు బుధవారం నులి పురుగుల నివారణకు సంబంధించి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రదర్శించే బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ టి.మదన్‌మోహన్‌రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి గీతాలక్ష్మి, డిస్ట్రిక్ట్ సర్వేలెన్స్ ఆఫీసర్ వాణిశ్రీ, ఎన్‌సీడీ అధికారి ఉమాశ్రీ, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, డిప్యూటీ డెమో ప్రసాద్, డీపీఓ శ్రీనివాస్, ఏ.రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

'యువ' ఆవిష్కరణలకు స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్



కాజీపేట అర్బన్: రాబోయే తరం యువ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు నూతన ఆవిష్కరణలు చేపట్టేందుకు ఫీల్డ్ ఎమిషన్ స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్ తోడ్పడుతుందని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ తెలిపారు. నిట్ వరంగల్‌లోని ఫిజిక్స్ విభాగంలో బుధవారం భారత ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ రూ.2.5 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన ఫీల్డ్ ఎమిషన్ స్కానింగ్ ఎలక్ట్రాన్ మైక్రోస్కోప్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించి మాట్లాడారు. సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిలో భాగంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ, నానో టెక్నాలజీ, బయోటెక్నాలజీ విభాగాల్లో ఇమేజింగ్ పద్ధతిలో మెటీరియల్స్ రీసెర్చ్‌కుగాను మైక్రోస్కోప్ తోడ్పడుతుందని ఆయన తెలిపారు. ఇంజనీరింగ్, సైన్స్, టెక్నాలజీ రంగాల్లో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టేందుకు మైక్రోస్కోప్ ముఖ్య భూమిక పోషిస్తుందని జీయాల్ లిమిటెడ్ కంపెనీ, జపాన్ ప్రతినిధి టోమోయోఎండో తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌సీ డీన్, ప్రొఫెసర్ వి.టి.సోమశేఖర్, ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ వెంకటప్పరావు, ప్రొఫెసర్లు దినకర్, అబ్దుల్ అజీమ్, శ్యామ్‌ప్రసాద్, హరనాథ్, సౌరభ్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సేవలు మరువలేనివి



హన్మకొండ అర్బన్: అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓలు వాసుచంద్ర, రాము జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బదిలీపై వెళ్తున్న వీరికి బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరయ్యారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌కుమార్, సీపీఓ సత్యనారాయణ, అధికారులు, టీఎన్జీఓ, టీజీఓ నాయకులు, బాధ్యులు పాల్గొన్నారు.

మా మధ్య ఎలాంటి విబేధాలు లేవు


డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట: రెండు రోజులుగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్‌పై అసమ్మతి ఉందని తమపై దుష్ప్రచారం జరిగిందని, అందరం ఒక్కటిగా ఉన్నామని డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. బుధవారం రాత్రి హనుమకొండలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో అసమ్మతి నేతలుగా ప్రచారం జరుగుతున్న నాయకులతో కలిసి సమావేశం అయ్యారు. మర్యాదపూర్వకంగానే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వినోద్‌కుమార్‌ను కలిసినట్లు తెలిపారు. అంతే తప్ప తాము పార్టీ గురించి కానీ.. ఎమ్మెల్యే అరూరి రమేష్‌కు వ్యతిరేకంగా ఎలాంటి మాటలు మాట్లాడలేదని వివరించారు.

తగ్గిన పేదరికం!

అయినా ఓరుగల్లులో కొనసాగుతున్న బహుముఖ పేదరికం

- మహబూబాబాద్, వరంగల్ రూరల్ జిల్లాల్లో అధికంగా పేదలు
- తక్కువ పేదలున్న జిల్లాల్లో పెద్దపల్లి తర్వాత వరంగల్ అర్బన్
- పరిశ్రమలు, చదువు, ఇతర వసతుల కల్పన
- జాతీయ బహుముఖ పేదరిక సూచికను వెల్లడించిన నీతి ఆయోగ్




(వరంగల్ డెస్క్)

ఓరుగల్లులో పదేళ్లలో పేదరికం తగ్గుముఖం పట్టింది. కొత్త పరిశ్రమల ఏర్పాటు, ఉద్యోగ, స్వయం ఉపాధితోపాటు అక్షరాస్యత పెరగడంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరికం తగ్గినట్లు నీతి ఆయోగ్ రూపొందించిన నేషనల్ మల్టీ డైమన్షియల్ పావర్టీ ఇండెక్స్ (జాతీయ బహుముఖ పేదరిక సూచిక)-2023లో పేర్కొంది. దేశంలో తెలంగాణ రాష్ట్రం.. అందులోనూ ఉమ్మడి ఓరుగల్లు జిల్లాలో పేదరికం.. బహుముఖ పేదరికస్థాయి గణాంకాలను వెల్లడించింది. 2015-16లో నిర్వహించిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4తోపాటు 2019-21లో నిర్వహించిన 5వ సర్వే ఫలితాలను విశ్లేషిస్తూ ఈ నివేదికను రూపొందించారు.

మన జిల్లాల్లో పేదరికం తక్కువే..

నీతి ఆయోగ్ వెల్లడించిన జాతీయ బహుముఖ పేదరిక సూచికలో రాష్ట్రం 13.08 శాతం నుంచి 5.88 శాతానికి తగ్గింది. అదేవిధంగా కుమ్రంభీం ఆసిఫాబాద్, జోగుళాంబ గద్వాల, ఆదిలాబాద్, మహబూబాబాద్, నిజామాబాద్ జిల్లాల కంటే తక్కువ మంది పేదలున్న ప్రాంతంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఉంది. అతి తక్కువ మంది పేదలున్న వాటిలో పెద్దపల్లి జిల్లా 2.17 శాతంతో మొదటి స్థానంలో ఉండగా, వరంగల్ అర్బన్ 2.41 శాతంతో రెండో స్థానంలో ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 38,20,369 మంది జనాభా ఉంది. ఇందులో 28,28,036 మంది పల్లెల్లో, 9,92,333 మంది పట్టణాల్లో జీవనం సాగిస్తున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య బహుముఖ పేదరికంలో అసమానతలు ఇప్పటికీ ఉన్నాయని నీతి ఆయోగ్ తన నివేదికలో పేర్కొంది.

నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5 (2019-21)



12 అంశాలే ప్రామాణికం..

జాతీయ బహుముఖ పేదరిక సూచికను మూడు అంశాలను ప్రామాణికంగా తీసుకుని నిర్ణయించారు. వాటిలో దేశ ప్రజల ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణం. ఇందులో ఒక్కో అంశాన్ని మరింత లోతుగా పరిశీలించారు. **ఆరోగ్యంలో :** పోషకాహారం (ఆరేళ్లలోపు పిల్లలు, 15-49 ఏళ్ల మహిళలతోపాటు 15-54 ఏళ్ల పురుషులు), పిల్లలు, కౌమార మరణాలు, మానసిక ఆరోగ్యం. **విద్యలో:** పాఠశాలలకు హాజరు.. ఎన్నేళ్లు బడికి వెళ్లారు? వంటి అంశాలను చూశారు. **జీవన ప్రమాణం కింద:** వంటగ్యాస్, శుభ్రత, తాగునీరు, గృహ నిర్మాణం, విద్యుత్, ఆస్తులు, బ్యాంకు అకౌంట్‌ను పరిశీలించారు.

తక్కువ పేదరికం వరంగల్ అర్బన్‌లోనే..

వరంగల్ అర్బన్ పరిధిలో ఐటీ కంపెనీలతోపాటు పలు వస్త్ర పరిశ్రమలున్నాయి. అదేవిధంగా నగరంలో వివిధ వ్యాపార, వాణిజ్య రంగాల పరిధి కూడా రోజురోజుకూ పెరుగుతోంది. దీనికితోడు హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరం అన్ని రంగాల్లో ముందుకెళ్తోంది. దీంతో ఇక్కడ ఉపాధి అవకాశాలు అధికంగా ఉండడంతో పేదరికం స్థాయి తక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది.



- నీతి ఆయోగ్ తన నివేదికలో ములుగు జిల్లా గణాంకాలను వెల్లడించలేదు. దీంతోపాటు 2015-16లో నిర్వహించిన నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-4లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పేదరికం 12.12 శాతం ఉండి తక్కువ మంది పేదలున్న జిల్లాగా 32వ స్థానంలో నిలిచింది. కాగా.. బహుముఖ పేదరికం మాత్రం 0.049 శాతంగా ఉంది. కానీ, 2019-21 నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే-5లో ఏ స్థాయిలో ఉందో వెల్లడించలేదు.

రుణాలు సకాలంలో అందించండి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: రైతులకు సకాలంలో రుణాలు అందించి ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ బ్యాంకర్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. మార్చి-23 వరకు రూ.1368.47 కోట్లు వ్యవసాయ పంట రుణాలుగా అందించినట్లు తెలిపారు. దీనిలోనే వ్యవసాయ దీర్ఘకాలిక రుణాలు రూ.51.48 కోట్లతో మొత్తం వ్యవసాయ రంగానికి రూ.2977.81 కోట్లు బ్యాంకుల నుంచి ఇచ్చినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాలను సకాలంలో అందించి లక్ష్యాలు సాధించాలని, రైతులు పంట రుణాలను సకాలంలో చెల్లించేలా అధికారులు క్షేత్రస్థాయిలో శ్రద్ధ చూపాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య స్థాయి పరిశ్రమలకుగాను రూ.1611.85 కోట్లు ఇచ్చినట్లు, విద్యా రుణాలుగా రూ.25.70 కోట్లు, గృహ రుణాలుగా రూ.50.75 కోట్లు అందించినట్లు తెలిపారు. జిల్లాలో మహిళా సంఘాలకు రూ.385 కోట్ల రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు, దీనిలో ఇప్పటి వరకు రూ.359.41 కోట్లు అందించి 93 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. అర్హత కలిగిన సంఘాలకు వెంటనే రుణాలు అందించాలని, రెన్యువల్ ప్రాసెసింగ్ ఫీజు లేకుండా చూడాలన్నారు. ఏఐఎఫ్, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మత్స్యకారులకు, పాల ఉత్పత్తిదారులకు రుణాలు అందించాలని ఆమె అన్నారు. జిల్లాలోని మారుమూల ప్రాంత ప్రజలకు బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడానికి జిల్లాలో 100 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం ద్వారా 35 శాతం సబ్సిడీతో ఈ-మోడల్ కామన్ సర్వీస్ సెంటర్స్ (సీఎస్‌సీ) కేంద్రాలు నెలకొల్పాలన్నారు. అనంతరం సీఎస్‌సీ కేంద్రాల పోస్టర్, కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, ఎస్‌బీఐ ఆర్‌ఎం రఘునాథ్, నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, ఆర్‌బీఐ ఎల్‌డీఓ అలీబాబా, డీఆర్‌డీఏ పీడీ ఎ.శ్రీనివాస్‌కుమార్, మోడల్ సీఎస్‌సీ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ బేతోజు హరికృష్ణ, జిల్లా మేనేజర్ పసుల పవన్, బ్యాంకింగ్ కంట్రోలర్లు, మేనేజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోండి

త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి మాస్టర్ శిక్షకులతో నియోజకవర్గ స్థాయి శిక్షకులకు ఫొటో ఎలక్టోరల్ రోల్ స్పెషల్ సమ్మరీ రివిజన్-23పై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియపై, బూత్ స్థాయి అధికారుల విధులు, బాధ్యతలు, ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వాసుచంద్ర, సీపీఓ సత్యనారాయణ, జీఎం ఇండస్ట్రీస్ హరిప్రసాద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ జ్యోతి, తహసీల్దార్లు రాజ్‌కుమార్, కిరణ్‌కుమార్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని సంతకాల సేకరణ

కార్యాచరణ ప్రకటించిన టీపీయూఎస్



సంతకాల సేకరణలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న టీపీయూఎస్ బాధ్యులు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) బుధవారం కార్యాచరణను ప్రకటించింది. ఈసందర్భంగా టీపీయూఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాత మహర్షి, జిల్లా జనరల్ సెక్రటరీ బత్తిని వీరస్వామి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల సతీశ్ మాట్లాడుతూ.. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బుధవారం వివిధ స్కూల్ కాంప్లెక్స్‌ల స్థాయిలో సంతకాల సేకరణ ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

నిరసన కార్యక్రమాలు ఇలా..

ఈనెల 25న తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం. 31న అధికారులకు వినతిపత్రాలు అందించడం. ఆగస్టు 5న కలెక్టరేట్ల ఎదుట ధర్నా, ఆగస్టు 19న హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి మహా ధర్నాను నిర్వహించనున్నారు. వరంగల్ జిల్లాలోని నల్లబెల్లి మండలంలోని పాఠశాలలు బొల్లోనిపల్లి, రామతీర్థం, కన్నరావుపేట, అర్షనపల్లి, శనిగరం, బుచ్చిరెడ్డిపల్లి, రుద్రగూడెం, గుండ్ల పహాడ్ మొదలైన పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులచే సంతకాల సేకరణ చేయనున్నారు. జిల్లాలోనూ పలు పాఠశాలల్లో సంతకాల సేకరణ నిర్వహించినట్లు ఆసంఘం బాధ్యులు తెలిపారు.

రైతును రాజు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- రైతు సదస్సులో ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి
- 132 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: రైతును రాజు చేస్తున్నది తెలంగాణ ప్రభుత్వం మాత్రమేనని, కాంగ్రెస్ పార్టీ లాంటి దుష్టశక్తులు ఎన్ని వచ్చినా.. రైతులను కాపాడుకునే నాయకుడు కేసీఆర్ ఉన్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా.. మండలంలోని వంగపల్లి రైతు వేదికలో బుధవారం నిర్వహించిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ రైతులను కాల్చి చంపింది చంద్రబాబునాయుడు కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ రాక ముందు రైతులు రేయింబవళ్లు కరెంట్ కోసం పడిగాపులు పడడం చూశామని, తెలంగాణ ఉద్యమమే కరెంట్ కోసం పుట్టిందన్నారు. మూడు గంటల కరెంట్ కావాలో.. మత పిచ్చి లేపే బీజేపీ కావాలో, మూడు పంటల ప్రభుత్వం కావాలో రైతులే తేల్చుకోవాలన్నారు. అనంతరం మర్రిపల్లిగూడేనికి చెందిన 81 మందికి, వంగపల్లికి చెందిన 51 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. గుండేడు, భీంపల్లి, ఉప్పల్, శనిగరం, మాదన్నపేట, గోపాల్‌పూర్, వంగపల్లి గ్రామాల్లో నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.7.50 లక్షల విలువైన 19 సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ రాణిశ్రీకాంత్, జెడ్పీటీసీ కల్యాణిలక్ష్మణ్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ సంపత్‌రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ శ్రీనివాస్, సర్పంచులు కమలమ్మసారయ్య, కిరణ్మయివిజయ్‌కుమార్, ఎంపీటీసీ రామస్వామి, ఉపసర్పంచ్ రాజు, తహసీల్దార్ పోలెపాక రాణి, మాజీ జెడ్పీటీసీ నవీన్‌కుమార్, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

కేసీఆర్, కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం..

మండలంలోని మర్రిపల్లిగూడెంలో సర్పంచ్ ఇనుగాల కిరణ్మయి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో లబ్ధిదారులు సీఎం కేసీఆర్, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. గత 20 సంవత్సరాలుగా ఇళ్ల స్థలాల పంపిణీ జరగక అద్దె ఇళ్లల్లో ఉంటున్నామని, కౌశిక్‌రెడ్డి చొరవ తీసుకుని తమకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి సొంతింటి కలను సాకారం చేశారని లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

ముసురేసింది...

- జిల్లాలో మోస్తరు వర్షం
- ఆనందంలో అన్నదాతలు

హన్మకొండ: రాష్ట్రంలో నైరుతి రుతు పవనాలు ఉధృతంగా ఉండడంతో పాటు ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం ఆకాశం మేఘావృతమై కొద్ది సమయం తెరిపి ఇచ్చినప్పటికీ రోజంతా ముసురు కురుస్తూనే ఉంది. మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో రైతుల్లో సంతోషం నెలకొంది. మొన్నటి వరకు ఎండలు మండిపోవడంతో రైతులు వానాకాలం సాగుపై ఆందోళన చెందారు. దుక్కిలో వేసుకున్న విత్తనాలు పూర్తి స్థాయిలో మొలకెత్తక నష్టపోయారు. ఈవర్షంతో విత్తనాలు మొలకెత్తని చోట విత్తనాలు తిరిగి విత్తేందుకు సిద్ధమయ్యారు. సాగు పనులు మొదలెట్టారు. ముందుగా నారు పోసుకున్న రైతులు వరి నాట్లు వేస్తున్నారు. వరి సాగు పనులు మొదలు పెట్టని రైతులు ఈ వర్షంతో పొలం దున్నుతున్నారు. హనుమకొండ జిల్లాలో మంగళవారం ఉదయం 8.30 నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలో సగటున 22.9 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అదే విధంగా బుధవారం కురిసిన వర్షానికి ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లో నమోదైన వర్షపాతం వివరాలను వాతావరణ శాఖ విడుదల చేసింది.

మంగళవారం జిల్లాలో వర్షపాతం మిల్లీమీటర్లలో..

భీమదేవరపల్లి 17.6, వేలేరు 17, ఎల్కతుర్తి 16.5, కమలాపూర్ 26.9, హసన్‌పర్తి 24.5, ధర్మసాగర్ 19.1, కాజీపేట 19.8, హనుమకొండ 22.7, ఐనవోలు 14.3, పరకాల 26.4, దామెర 32.5, ఆత్మకూరు 30.8, శాయంపేట 28, నడికూడ 24.4మిల్లీమీటర్లుగా వర్షపాతం నమోదైంది.

బుధవారం..

పెద్దపెండ్యాల 53.8, ఐనవోలు 49.3, కొండపర్తి 36.3, హసన్‌పర్తి 33.5, మడికొండ 31.8 కాజీపేట 28.3, వేలేరు 22.8, ధర్మసాగర్ 21.5, కమలాపూర్ 21.5, ఎల్కతుర్తి 20.3, పెద్దమ్మగడ్డ 20.3, దామెర 18.8, హసన్‌పర్తి నాగారం 18.5, మరిపల్లిగూడెం 13.8, పరకాల13.8, భీమదేవపల్లి 13.3, శాయంపేట13, నడికూడ 12మిల్లీమీటర్లుగా నమోదైంది.

వర్షాలకు కూలిన ఇళ్లు



బాధితులను కమ్యూనిటీహాల్‌కు తరలిస్తున్న వీఆర్‌ఏ



ల్యాదెళ్లలో కూలిన సంగాల చిన్నరవి ఇల్లు

ఆత్మకూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మంగళవారం రాత్రి నుంచి వర్షం ఎడతెరిపి లేకుండా కురుస్తుంది. నీరుకుళ్లలో సిరిమిల్ల విజయ్‌కుమార్‌కు చెందిన ఇంటి గోడలు కూలిపోయాయి. దీంతో బాధిత కుటుంబ సభ్యులను స్థానిక వీఆర్‌ఏ వంగేటి సత్యం ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు తరలించారు.

దామెర: మండలంలో గత రెండు రోజులుగా వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తున్నాయి. మండలంలోని ల్యాదెళ్ల గ్రామానికి చెందిన సంగాల చిన్న రవి ఇల్లు బుధవారం నేలమట్టమైంది. సర్పంచ్ బాధిత కుటుంబాన్ని గ్రామంలోని మరో ఇంటికి తరలించారు. దామెర, సింగరాజుపల్లి, ముస్త్యాలపల్లి, ఊరుగొండ గ్రామాల్లో పలు వీధుల్లో నీరు చేరింది.

భూపాలపల్లి ఎస్పీగా కరుణాకర్

- కమాండ్ కంట్రోల్ ఎస్పీగా పుష్పారెడ్డి
- బదిలీ చేస్తూ ఉత్తర్వులు



కరుణాకర్



పుష్ప

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తున్న ఇద్దరు ఉన్నతాధికారులు పుల్ల కరుణాకర్, పుష్పను బదిలీ చేస్తూ డీజీపీ అంజనీకుమార్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పుల్ల కరుణాకర్‌ది హనుమకొండ జిల్లా కమలాపురం మండలం ఉప్పల్. ఆయన వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఈస్ట్‌జోన్ డీసీపీగా ఈ ఏడాది జనవరి 29న బాధ్యతలు స్వీకరించారు. సొంత జిల్లా కావడంతో ఎన్నికల కోడ్ వర్తించనున్న నేపథ్యంలో ఆరు నెలలకే ప్రభుత్వం భూపాలపల్లి ఎస్పీగా బదిలీ చేసింది. అదేవిధంగా సుమారు నాలుగేళ్ల క్రితం కమిషనరేట్ పరిధిలో అదనపుగా డీసీపీగా వచ్చిన కర్రి పుష్పారెడ్డి మొదట సెంట్రల్ జోన్ ఇన్‌చార్జ్ డీసీపీగా, ట్రాఫిక్ అదనపు డీసీపీగా, క్రైమ్ అదనపు డీసీపీగా పనిచేశారు. ప్రస్తుతం ట్రాఫిక్, అడ్మిన్ అదనపు డీసీపీగా పనిచేస్తున్న సమయంలో నెల క్రితం డీసీపీగా పదోన్నతి లభించింది. పుష్పారెడ్డిని హైదరాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఎస్పీగా బదిలీ చేశారు. ఈ ఇద్దరికి కమిషనరేట్‌లో సమర్థవంతమైన అధికారులుగా డిపార్ట్‌మెంట్‌లో పేరు ఉంది. వీరిని పలువురు పోలీస్ అధికారులు అభినందించారు.

జన చైతన్య వేదిక బుద్ధభవన్

- ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్
- రూ.50 లక్షలతో భవనం పునఃనిర్మాణం



మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: పేద ప్రజలు విద్య, సామాజిక రంగాల్లో రాణించేందుకు బుద్ధభవన్ గొప్ప చైతన్య వేదికగా నిలిచిందని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ కుమార్‌పల్లిలోని బుద్ధభవన్ ఆవరణలో బుధవారం భవన పునఃనిర్మాణ కమిటీ సమావేశం నిర్వహించారు. వచ్చేనెల (ఆగస్టు) 18వ తేదీన బుద్ధభవన్ పునఃనిర్మాణ పనులు ప్రారంభించనున్న నేపథ్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హాజరై బుద్ధభవన్ వ్యవస్థాపకుడు బీఆర్ భగవాన్‌దాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సుమారు ఆరు దశాబ్దాల క్రితం ఇక్కడి ప్రజలు స్వయంకృషితో నిర్మించుకున్న బుద్ధభవన్, పునఃనిర్మాణంలో ప్రభుత్వం తరపున భాగస్వామ్యం కల్పించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆధునిక హంగులతో బుద్ధుడి సన్నిధిలో ప్రశాంతత చేకూరేలా భవన నిర్మాణం జరిగేలా కృషి చేస్తామన్నారు. భవన నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బుద్ధభవన్‌తో పాటు స్థానికంగా యూత్‌భవన్ పునఃనిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులు కేటాయిస్తానని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బుద్ధభవన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కార్యదర్శి వంగల సుదర్శన్, బుద్ధభవన్ పునఃనిర్మాణ కమిటీ అధ్యక్షుడు బీఆర్ లెనిన్, కార్యదర్శి గోకారపు శ్యాంకుమార్, ముఖ్య సలహాదారులు అంకేసరపు సారయ్య, కన్వీనర్ కునమల్ల జితేందర్, సభ్యులు గొర్రె రవీందర్, యాళ్ల సంజయ్‌కుమార్, అరుణోదయ, టీఆర్ఎస్ నాయకులు నలుబోలు సతీశ్, సిద్దంశెట్టి శ్రీనివాస్, చింతాకుల ప్రభాకర్, శ్రావణ్ పాల్గొన్నారు.

కేయూ పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా

● రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు

కేయూ క్యాంపస్ : తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రభుత్వం రెడ్ అలెర్ట్ ప్రకటించిన నేపథ్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో ఈనెల 20వ (నేటి నుంచి) తేదీ నుంచి ప్రారంభం కానున్న వివిధ విభాగాల్లోని పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాల ఇంటర్వ్యూలను నిరవధికంగా వాయిదా వేసినట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య శ్రీనివాసరావు తెలిపారు. ఇంటర్వ్యూలను తిరిగి ఎప్పుడు నిర్వహించే తేదీలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లోని పరిపాలనాభవనంలో వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన డీన్లు, విభాగాధిపతుల, పాఠ్య ప్రణాళిక అధ్యక్షులు, ఇతర అధికారులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో పీహెచ్‌డీ ప్రవేశాల ఇంటర్వ్యూలు వాయిదా వేస్తున్నట్లు ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు. అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించాలని, మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్‌లో చూడాలని శ్రీనివాసరావు వెల్లడించారు.

కార్మికుడి మృతదేహం లభ్యం

నెక్కొండ: కుంటలో స్నానానికి వెళ్లి నీట మునిగి గల్లంతైన కార్మికుడి మృతదేహం లభ్యమైంది. బిహార్‌కు చెందిన రామ్‌సోరణ్ ఈ నెల 17న స్థానిక చల్లా గోదాంల సమీపంలోని కుంటలో స్నానానికి వెళ్లాడు. నీట మునిగి గల్లంతు కాగా, కుంటలో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో బుధవారం ఉదయం కుంటలో రామ్‌సోరణ్ మృతదేహం తేలి ఉండడం చూసిన తోటి కార్మికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. దీనిపై మృతుడి సోదరుడు పప్పు సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించామని ఎస్సై జానీపాషా పేర్కొన్నారు.

పథకం వెల్.. పబ్లిసిటీ డల్

'కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కా భరోసా'కు ఆదరణ కరువు

● నేడు ముగియనున్న గడువు
● అర్హులకు అందేనా?
● గడువు పొడిగించాలి: మైనార్టీ సంఘాలు


శిక్షణ పొందుతున్న మహిళలు(ఫైల్)

న్యూశాయంపేట: నిరుపేద మైనార్టీ (వితంతువులు, ఒంటరి, విడాకులు తీసుకున్నవారు) మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం.. స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఇటీవల 'కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కా భరోసా'(కేసీఆర్ మహిళల కానుక) పేరుతో నూతన పథకం ప్రారంభించింది. ఈ పథకంలో భాగంగా నియోజకవర్గానికి వంద చొప్పున ఉచిత కుట్టుమిషన్లు అందించనుంది. మైనార్టీలు అధికంగా ఉన్న నియోజకవర్గాలకు అదనంగా మరో వంద మిషన్ల చొప్పున అందించనుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 నియోజకవర్గాలకు నియోజకవర్గానికి వంద చొప్పున 12 వందల మందికి కుట్టుమిషన్లు అందజేయనుంది. అలాగే, మైనార్టీలు అధికంగా ఉన్న వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు మరో వంద కుట్టుమిషన్లు పంపిణీ చేయనుంది.

దరఖాస్తులకు నేటితో గడువు పూర్తి..

పథకం ప్రారంభించిన అనంతరం అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆ గడువు నేటితో(గురువారం) ముగియనుంది. అయితే పథకం బాగున్నా సరైనా ప్రచారం కల్పించడం లేదు. దీంతో పథక ఫలాలను అందుకోలేకపోతున్నామని నిరుపేద మైనార్టీ మహిళలు వాపోతున్నారు. దరఖాస్తులను స్థానిక ఎమ్మెల్యే ద్వారా అందజేయాలని మైనార్టీ కార్పొరేషన్ అధికారులు చెబుతున్నా.. తమకు ఎలాంటి సమాచారం లేదని స్థానిక ప్రజాప్రతినిధులు వెనక్కి పంపిస్తున్నారు. కాగా, దరఖాస్తు చేసుకోవడానికి ఆయా జిల్లాలోని మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయాల చుట్టు పేద మైనార్టీ మహిళలు ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం విధించిన గడువును వెంటనే పొడగించాలని మైనార్టీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అయోమయంలో మహిళలు..

'కేసీఆర్ కా తోఫా ఖవాతీన్ కా భరోసా' పథకానికి సరైనా ప్రచారం కల్పించక పోవడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మైనార్టీ మహిళలు దరఖాస్తులు చేసుకోలేదని తెలుస్తోంది. ఈ పథకం స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా అమలు చేయాలని నిర్ణయించింది. ఎమ్మెల్యేల ద్వారా ఈనెల 20 వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరించి వాటిని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారుల ద్వారా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే పథకం గురించి ప్రజాప్రతినిధులకే తెలియకపోవడంతో అర్హులు అయోమయానికి గురవుతున్నారు.

పథకానికి అర్హతలు...

ఈ పథకానికి అత్యంత నిరుపేద మైనార్టీ మహిళలు అర్హులు. (వితంతువులు, ఒంటరి, విడాకులు తీసుకున్న మహిళలు) 21 నుంచి 55 ఏళ్ల వయసు ఉండాలి. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ. 2లక్షల లోపు ఆదాయ ఉండాలి. ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్లరేషన్ కార్డు, ఆధార్ కార్డు, 5వ తరగతి విద్యార్హత, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు జతచేసి స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గడువు సమీపిస్తుండడంతో రెండు రోజుల నుంచి ప్రజాప్రతినిధుల ఇళ్లకు వెళ్లిన మైనార్టీ మహిళలు అక్కడ పడిగాపులు కాస్తున్నారు. నిరుపేద మహిళల ద్వారా దరఖాస్తులు తీసుకున్న ప్రజాప్రతినిధులు వాటిని ఈనెల 21వ తేదీ వరకు కలెక్టర్లకు అందజేయాలి. కలెక్టర్ ఈ దరఖాస్తులను పరిశీలించి ఈనెల 27తేదీ వరకు స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమర్పించాల్సి ఉంది.

గడువు పెంచి, విస్తృత ప్రచారం చేయాలి



గడువు తేదీని పొడిగించాలి. పథకంపై విస్తృత ప్రచారం కల్పించాలి. దళితబంధు మాదిరి యూనిట్‌లను అందించాలి. యూనిట్ కాస్ట్‌లను పెంచి పేదమహిళలకు స్వయం ఉపాధి అందించాలి. ఉచిత కుట్టుమిషన్ పథకం యూనిట్‌లను నియోజకవర్గానికి ఐదువందల చొప్పున పొడిగించాలి.

\- రాజ్ మహ్మద్, అధ్యక్షుడు మైనార్టీ రైట్స్ ప్రొటెక్షన్ ఫ్రంట్, ఉమ్మడి వరంగల్

జలసవ్వడి..

● జాలువారుతున్న భీమునిపాద జలపాతం
● పర్యాటకుల సందడి..


సీతానగరం శివారు కొమ్ములవంచ అడవిలో ప్రారంభమైన భీమునిపాద జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు భీమునిపాద జలపాతం జాలువారుతోంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బుధవారం సాయంత్రం మొదటిసారి పాలనురగలా జారి పడుతూ కనువిందు చేసింది. దీంతో పర్యాటకులు తమ సెల్‌ఫోన్‌లో జలపాత దృశ్యాలను బంధిస్తూ సంతోషం వ్యక్తం చేశారు. జలపాత సమీపంలో గూడూరు ఫారెస్టు రేంజ్ అధికారులు చెక్‌పోస్టు ఏర్పాటు చేసి అక్కడ మద్యపాన నిషేధం అమలు చేసినట్లు సిబ్బంది మధు తెలిపారు. కాగా, వర్షాకాలం ప్రారంభం నుంచి మండు వేసవి వరకు.. భీమునిపాద జలపాతం పర్యాటకులను కనువిందు చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచే కాక ఖమ్మం, హైదరాబాద్ నుంచి కూడా ఈ జలపాతం వీక్షించడానికి పర్యాటకులు వస్తుంటారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖానాపురం: చికిత్స పొందుతున్న ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని బుధరావుపేటలో జరిగింది. గ్రామానికి చెందిన గొల్లపల్లి జీవన్(26) కూలీ పని చేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంలో స్థిరపడడం లేదని తరచూ బాధపడుతూ అధికంగా మద్యం సేవించే వాడు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పిట్టల తిరుపతి తెలిపారు.

ఇసుక లారీ ఢీ : కార్మికుడి దుర్మరణం

ఆత్మకూరు: ఇసుక లారీ ఢీకొని ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని కొత్తగట్టు శివారులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఒడిశా రాష్ట్రానికి చెందిన విశ్వాస్(36) పరకాలలో సెంట్రింగ్ పనులు చేస్తున్నాడు. బుధవారం హనుమకొండకు వెళ్లి సాయంత్రం తిరిగి పరకాలకు బైక్‌పై వెళ్తున్నాడు.ఈ క్రమంలో కొత్తగట్టు సమీపంలో ఎదురుగా వస్తున్న ఇసుక లారీ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలపాలైన విశ్వాస్‌ను వెంటనే 108లో ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రసాద్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఫిర్యాదు అందగానే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పసుపు.. కాడి రకానికి రికార్డు ధర

● క్వింటాల్‌కు రూ.9501


పసుపు రైతు రాంబాబు

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం విక్రయానికి వచ్చిన పసుపు.. కాడి రకానికి కొనుగోలుదారుడు రికార్డు స్థాయిలో ధర చెల్లించారు. ఖమ్మం జిల్లా ఎర్రిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన రైతు కే రాంబాబు 50 బస్తాల కాడి రకం పసుపును మార్కెట్‌కు తీసుకొచ్చాడు. వెంకటసాయి ట్రేడర్స్ క్వింటాల్‌కు రూ.9501 చెల్లించి కొనుగోలు చేశారు. కాగా, ఆరు సంత్సరాల తర్వాత పసుపుకు అత్యధిక ధర పలిందని రైతు ఆనందం వ్యక్తం చేశాడు. కాగా, బుధవారం కాడి రకం పసుపు బస్తాలు 222 రాగా క్వింటాల్‌కు గరిష్టంగా రూ.9501, కనిష్టంగా రూ.8500, గోల రకం పసుపు బస్తాలు 98రాగా గరిష్ట ధర రూ.9101, కనిష్టంగా 8100 ధర నమోదైనట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

గోదావరికి పోటెత్తిన వరద

మహారాష్ట్ర నుంచి ప్రాణహిత ఇన్‌ఫ్లో 5.41 లక్షల క్యూసెక్కులు

● కాళేశ్వరం వద్ద 9.500 మీటర్లకు చేరిన నీటిమట్టం
● లక్ష్మీపంపుహౌస్‌లో మోటార్ల నిలిపివేత
● లక్ష్మీబ్యారేజీలో 57 గేట్లు ఎత్తివేత


కాళేశ్వరం అంతరాష్ట్ర వంతెన నుంచి తరలివెళ్తున్న వరద నీరు


కాళేశ్వరం వద్ద గోదావరికి పోటెత్తిన వరద


లక్ష్మీపంపుహౌస్‌లో నిలిపివేసిన మోటార్లు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం వద్ద మహారాష్ట్ర నుంచి తరలివస్తున్న ప్రాణహిత నది వరదతో గోదావరి పోటెత్తింది. మహారాష్ట్రలో ఎగువన గడ్చిరోలి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో బుధవారం కాళేశ్వరం వద్ద గోదావరికి 9.500 మీటర్ల ఎత్తులో నీటిమట్టం పెరిగింది. వరదనీరు దిగువకు అంతరాష్ట్ర వంతెన నుంచి తరలి మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీకి వెళ్తుంది.

మోటార్ల నిలిపివేత

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్‌లో వర్షాల కారణంగా మోటార్లను సీఎంఓ కార్యాలయం ఆదేశాలతో ఇంజనీరింగ్ అధికారులు నీటి పంపింగ్ నిలిపివేశారు. ఈనెల 3 నుంచి మంగళవారం రాత్రి వరకు నీటిని ఎత్తిపోశారు. ఇప్పటి వరకు 16 రోజుల్లో అన్నారం(సరస్వతీ) బ్యారేజీకి 9 టీఎంసీల నీటిని గ్రావిటీకాల్వ ద్వారా తరలించారు.

లక్ష్మీబ్యారేజీ 57 గేట్లు ఎత్తివేత

ఎగువ మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదికి భారీగా వరద వస్తుండడంతో ఇన్‌ఫ్లో 5.41 లక్షల క్యూసెక్కులు ప్రవహిస్తుంది. వరదనీరు మేడిగడ్డలోని లక్ష్మీ బ్యారేజీకి చేరుతుంది. వరద ఉధృతి పెరుగుతుండడంతో బ్యారేజీలో మొత్తం 85 గేట్లు ఉండగా 57 గేట్లు ఎత్తి నీటిని దిగువకు తరలిస్తున్నారు. అవుట్‌ఫ్లో 5.25 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళ్తుంది. బ్యారేజీ పూర్తి సామర్థ్యం 16.17 టీఎంసీలకు గాను ప్రస్తుతం 9.64 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సరస్వతీ గేట్లు ఎత్తే అవకాశం!

లక్ష్మీపంపుహౌస్‌లో ఎత్తిపోసిన నీరు అన్నారం(సరస్వతీ)బ్యారేజీకి చేరుతాయి. ఇటు తెలంగాణలో కూడా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. బ్యారేజీలో మొత్తం 66 గేట్లు మూసి ఉంచారు. రాత్రి వరద ఉధృతి పెరిగితే బ్యారేజీలో కొన్ని గేట్లు ఎత్తి నీటిని కాళేశ్వరం మీదుగా తరలించడానికి అధికారులు ఇప్పటికే వాట్సాప్ గ్రూపుల్లో దిగువ ఉన్న గ్రామాల వారికి హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అన్నారం చంద్రుపల్లి, నాగేపల్లి, మద్దులపల్లి, పలుగుల, పూస్కుపల్లి, కాళేశ్వరం మీదుగా వరద నీరు దిగువన మళ్లీ లక్ష్మీబ్యారేజీకి చేరనున్నాయి. ప్రస్తుతం బ్యారేజీలో 10.87 టీఎంసీలకు గాను ప్రస్తుతం 8.58 టీఎంసీల నీరు నిల్వ ఉంది. సరస్వతీ బ్యారేజీకి ఎగువ మానేరు, ఇతర వాగుల, వంకల నుంచి 9.2 వేల క్యూసెక్కుల వరద తరలివస్తుంది. ఒక వేళ పెద్దపల్లి జిల్లా గుంజపడుగు వద్ద ఉన్న అన్నారం(సరస్వతీ పంపుహౌస్)లో మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తే గేట్లు ఎత్తే అవసరం లేదని తెలిసింది. ఒకవేళ వరదపోటు పెరిగి గేట్లు ఎత్తినటయితే 16 రోజులుగా లక్ష్మీపంపుహౌస్ నుంచి 9 టీఎంసీల నీటిని ఎత్తిపోయగా..ఆ జలాలన్ని మళ్లీ కాళేశ్వరం చేరనున్నాయని ఇంజనీరింగ్ అధికారులంతా తలలు పట్టుకున్నట్లు సమాచారం.

ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలు..

● దరఖాస్తులకు ఈ నెల 31 చివరి గడువు
● విద్యార్థులు వినియోగించుకోవాలి
● వరంగల్ ఆర్టీసీ ఐటీఐ ప్రిన్సిపాల్ మోహన్‌రావు

హన్మకొండ: 90 సంవత్సరాలుగా రవాణా రంగంలో అత్యుత్తమ సేవలందిస్తూ విశేష ప్రజాదరణ చూరగొన్న సంస్థ ఆర్టీసీ. ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలు పొందేందుకు ఈ నెల 31వ తేదీ చివరి గడువు అని ప్రిన్సిపాల్ వంగాల మోహన్ రావు తెలిపారు. నిరుద్యోగ యువతకు చక్కటి శిక్షణ, బంగారు భవిష్యత్తు అందించేందుకు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వి.సి. సజ్జనార్ ఆర్టీసీ ఐటీఐని స్థాపించారన్నారు. డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, పెయింటర్, వెల్డర్ ట్రేడ్‌లతో టీఎస్ ఆర్టీసీ ఐటీఐని 2022-2023 విద్యా సంవత్సరం నుంచి వరంగల్‌లో నెలకొల్పినట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. 2023-2024 విద్యా సంవత్సరానికిగాను ఈ ఐటీఐలో రెండో విడత అడ్మిషన్ల కోసం ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. టీఎస్ ఆర్టీసీ ఐటీఐలో ప్రవేశాలు పొందాలనుకునే ఆసక్తి అభ్యర్థులు ముందు htt pr-://iti.teanfana.gov.in వెబ్ సైట్‌లో అప్లికంట్ క్లిక్ ఇయర్ టు ఆప్లై న్యూ రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేసి తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థికి పని చేస్తున్న ఫోన్ నంబర్, సొంత ఈ-మెయిల్ ఐడీ కలిగి ఉండాలి. తదుపరి లావాదేవీలన్నీ వీటి ద్వారా మాత్రమే జరుగుతాయని వివరించారు. విద్యార్థి సంతకం, పాస్ పోర్టు సైజ్ ఫొటోను జేపీజీలో స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలని, అదే విధంగా అవసరమైన ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి అప్‌లోడ్ చేయాలన్నారు. కాలేజీ ప్రిఫరెన్స్ వద్ద జిల్లా వరంగల్, టైప్: ప్రైవేట్ ఐటీఐ, టీఎస్ ఆర్టీసీ ఐటీఐ వరంగల్, చేరాలనుకునే ట్రేడ్‌ను నమోదు చేయాలని తెలిపారు. ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం వరంగల్ ములుగు రోడ్డులోని ఆర్టీసీ ఐటీఐ కళాశాల/ ఆర్టీసీ జోనల్ శిక్షణ కళాశాలలోగాని సమీపంలోని ఆర్టీసీ డిపోల్లో సంప్రదించాలని కోరారు. అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌తో పాటు బస్‌పాస్ సౌకర్యం ఉందన్నారు. విద్యార్థులు కోరుకున్న ఆర్టీసీ డిపోలలో అప్రెంటీషిప్ సౌకర్యం కల్పిస్తామని, స్వయం ఉపాధి పొందడానికి అవసరమైన నైపుణ్యం వచ్చేలా ప్రతీ విద్యార్థిని ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దుతామన్నారు. ఉచిత కంప్యూటర్ శిక్షణ, కంప్యూటర్ ఆధారిత పరీక్షలపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 0870-2982043, 9849425319, 8008136611 ఫోన్ నంబర్‌లలో, టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

ఖాళీల వివరాలు:

ట్రేడ్ పేరు	కాల వ్యవధి	ఖాళీలు	అర్హత
డీజిల్ మెకానిక్	ఒక సంవత్సరం	48	పదో తరగతి
మోటార్ మెకానిక్	రెండు సంవత్సరాలు	24	పదో తరగతి
పెయింటర్	రెండు సంవత్సరాలు	20	ఎనిమిదో తరగతి
వెల్డర్	ఒక సంవత్సరం	40	ఎనిమిదో తరగతి

అదనపు కట్నం కోసం వేధింపులు..

● వివాహిత ఆత్మహత్య


రాజేశ్వరి (ఫైల్)

నెక్కొండ: అదనపు కట్నం కోసం భర్త, అత్తమామలు వేధించడంతో మనస్తాపం చెందిన ఓ వివాహిత.. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన బుధవారం మండలంలోని మూడు తండా జీపీ పరిధి పెద్దమంగళి తండాలో జరిగింది. ఎస్సై జానీపాషా కథనం ప్రకారం తండాకు చెందిన భూక్య జ్యోతి, వెంకన్న దంపతులు కూతురు రాజేశ్వరి (21)కి ములుగు జిల్లా దేవగిరిపట్నానికి చెందిన వాంకుడోతు మోతీ, రుక్లా దంపతుల కుమారుడు రమేశ్‌తో ఏడాదిన్నర క్రితం జరిగింది. రమేశ్ ప్రైవేట్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా ఆయన పని వెళ్లకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో బంగారం, అదనపు కట్నం కోసం భార్యను వేధించసాగాడు. ఫలితంగా రాజేశ్వరి మూడు నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. ఈ విషయమై ఇటీవల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు.. దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించినా రమేశ్‌లో మార్పు రాకపోవడంతోపాటు భర్త, అత్తమామల వేధింపులు ఎక్కువ అయ్యాయి. దీంతో వేధింపులు భరించలేక సూసైడ్ నోట్ రాసిన అనంతరం మంగళవారం తెల్లవారుజామున రాజేశ్వరి ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీజీ అభ్యర్థులకు గుడ్ న్యూస్..

● వివిధ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఐఈఓ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ కోర్సుల్లో సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులు ఉండాలని, ఈనెల 24న సాయంత్రం 5గంటలవరకు హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఖాళీలు ఇలా..

జిల్లాలోని కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ, హిందీ, హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మ్యాథ్స్, శాయంపేటలోని జూనియర్ కళాశాలలో ఫిజిక్స్, బాటనీ, ఎకనామిక్స్, జువాలజీ, వడ్డేపల్లి పింగిళి కళాశాలలో సంస్కృతం, పరకాల కళాశాలలో మ్యాథ్స్, ఫిజిక్స్, జువాలజీ, పీఎస్‌టీటీ, హనుమకొండలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఎల్ఎంఅండ్‌డీటీ, టీఅండ్‌హెచ్ఎం, హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంగ్లిష్, మ్యాథ్స్, ఎకనామిక్స్ సబ్జెక్టులో నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులను కలెక్టర్ అధ్యక్షులుగా, జిల్లా అదనపు కలెక్టర్, సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు సభ్యులుగా ఉన్న కమిటీ నియామించనుంది. ఒక పీరియడ్‌కు రూ.390 చొప్పున ఒక నెలలో గరిష్టంగా 72 పీరియడ్‌లకు మాత్రమే చెల్లించనున్నారు. బయోడేటాతో పాటు ఎస్సెస్సీ మెమో, ఇంటర్, డిగ్రీ, పీజీ మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లు, లోకల్ లేదా నేటివిటీ, క్యాస్ట్ గెజిటెడ్ అధికారి ధ్రువీకరణతో సమర్పించాల్సి ఉంటుంది. ఈ నియామకాలు 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించినవి మాత్రమేనని, రెన్యూవల్‌కు ఆస్కారం లేదని తెలిపారు.

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో విద్యాబోధనకుగాను గెస్ట్ (అతిథి) అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రాజారెడ్డి బుధవారం తెలిపారు. ఇంగ్లిష్ 6, తెలుగు 1, సంస్కృతం 1, కామర్స్ 2, బీబీఏ 3, బిజినెస్ అనాలసిస్ 1, డాటాసైన్స్ 1, బాటనీ 1, జువాలజీ 2, మైక్రోబయాలజీ 1, కంప్యూటర్ సైన్స్ 3, క్రాఫ్ ప్రొడక్షన్ 1, ఫిష్ రిష్ 1, స్టాటిస్టిక్స్ 1 మొత్తంగా 25 పోస్టుల్లో గెస్ట్ లెక్చరర్లను నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈఖాళీల్లో యూజీసీ నిబంధనల ప్రకారం పీజీ కోర్సుల్లో మార్కులు 55 శాతం కలిగి ఉండాలని, నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీలో ఏదైనా ఒక అర్హత కలిగిన అభ్యర్థులు ఈనెల 25న సాయంత్రం 5 గంటల వరకు కేడీసీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూలు ఈనెల 26న ఉదయం 11 గంటల నుంచి కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు.. వివరాలకు 99480 32343 నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో..

కాళోజి సెంటర్ : వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న డీఐఈఓ కాక మాధవరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఖానాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో (ఫిజిక్స్-1, మ్యాథమెటిక్స్-1, సివిక్స్-1), నర్సంపేట కోఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో (మ్యాథమెటిక్స్-1, బోటనీ-1), నర్సంపేట ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో (మ్యాథమెటిక్స్-1, ఫిజిక్స్-1, బోటనీ-1), వర్ధన్నపేటలో (మ్యాథమెటిక్స్-1), రాయపర్తిలో (మ్యాథమెటిక్స్-1), సంగెంలో (మ్యాథమెటిక్స్-1, హిస్టరీ-1), నెక్కొండలో (మ్యాథమెటిక్స్-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1), రంగశాయిపేటలో (మ్యాథమెటిక్స్-1) కృష్ణా కాలనీ బాలికల జూనియర్ కళాశాలలో (జువాలజీ-1, మ్యాథమెటిక్స్-1, ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్)-1) ఖాళీల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నియామకాలు 2023-2024 విద్యా సంవత్సరానికి మాత్రమే పరిమితమని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్ట్‌లో పీజీ పూర్తి చేసి, 50 శాతం కన్నా ఎక్కువ మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 24వ తేదీలోపు హనుమకొండలోని డీఐఈఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలని వివరించారు. దరఖాస్తులతో పాటు పూర్తి బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు జతపర్చాలన్నారు.